ప్రజాశక్తి
సోమవారం 30 జూన్ 2025



మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

- జిజిహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- ప్రజాశక్తితో జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ప్రజలకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యమని జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు తెలిపారు. జిజిహెచ్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఓపి రద్దీని తగ్గించడానికి కౌంటర్ల సంఖ్య పెంచినట్లు చెప్పారు. ప్రజాశక్తితో ఆయన ముఖాముఖిగా మాట్లాడారు...

జిజిహెచ్‌లో ఎన్ని బెడ్స్ అందుబాటులో ఉన్నాయి?

సూపరింటెండెంట్ : కర్నూలు జిజిహెచ్‌లో 1600 ఇన్ బెడ్స్ వున్నాయి. ఇందులో ఐసీయూ 200 బెడ్స్, సూపర్ స్పెషాలిటీలో 200 బెడ్స్ ఉంటాయి. ఇవి కాక స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌లో మరో 200 దాకా బెడ్స్ ఉంటాయి.

సూపరింటెండెంట్‌గా భాద్యతలు చేపట్టిన తరువాత ఎలాంటి మార్పులు తీసుకువచ్చారు?

సూపరింటెండెంట్ : మరో సిటీ స్కాన్ ఏర్పాటు చేసాము. ఓపి రద్దీ తగ్గించేందుకు కౌంటర్లు సంఖ్యను పెంచాము. సూపర్ స్పెషాలిటీ ఓపి దగ్గర ప్రత్యేక ఓపి కౌంటర్ ను ఏర్పాటు చేసాము.మాత శిశు సంరక్షణ భవన్ బ్లాక్‌లోనే గర్భవతుల సౌకర్యార్థం రెండు అల్ట్రాసౌండ్ మిషన్లు, టిఫా స్కానింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాము. స్టేట్ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్‌ను పూర్తి స్థాయిలో ప్రారంభించుకొని ఆపరేషన్స్ నిర్వహిస్తున్నాము. వాహనాల రాకపోకలకు గతంలో ఒక గేటు ఉండేది మరో గేటును ఏర్పాటు చేసాము. ఈఎన్‌టి బెరా టెస్ట్ ఏర్పాటు చేశాము. వార్డులు, క్లినికల్ యూనిట్స్, స్కానింగ్ సెంటర్లను తెలిపే డైరెక్షన్ బోర్డ్స్‌ను కొత్తగా ఏర్పాటు చేశాం.

హాస్పిటల్ మౌలిక వసతులపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.

సూపరింటెండెంట్ : క్యాజువాలిటీలో 30 నుంచి 50 బెడ్స్ సంఖ్యను పెంచి కొత్త ఐసీయూ బెడ్స్‌ను ఏర్పాటు చేశాము. క్యాజీవాలిటిలో సర్జికల్ యూనిట్ మార్పు చేయించాము. వెంటీలేటర్స్ కొన్నింటిని రిపేరు చేయించి కొత్త వాటిని కొనుగోలు చేసాము. క్యాజువాలిటీలో ఒక వాష్ రూమ్ వుంటే వెనుకాల ఆరు కొత్త వాష్ రూమ్స్ ఏర్పాటు చేశాము. లిఫ్టును మార్పు చేశాము.కొత్తగా 20 స్ట్రక్చర్స్ కొన్నాము, పాత వీల్ చైర్స్ రిపేర్ చేయించాము. ఆర్ఐసియును గతంలో క్రియేట్ చేశారు. దాన్ని విస్తరించడం కోసం న్యూ డయాగ్నస్టిక్స్ బ్లాక్ పైన క్రిటికల్ కేర్ బ్లాకును ఏర్పాటు చేస్తున్నాము. అది నిర్మాణంలో ఉంది. పూర్తి అయితే 30 బెడ్స్ అందుబాటులోకి వస్తాయి. కోకోకోలా కంపెనీ వారి సహకారంతో రెండు మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశాం.

ఓపి కౌంటర్ వద్ద రద్దీని తగ్గించడానికి ఎలాంటి చర్యలు చేపట్టారు?

సూపరింటెండెంట్ : ఓపి రద్దీని తగ్గించేందుకు అనేక చర్యలు చేపట్టాము.ఓపి దగ్గర ప్రత్యేక కౌంటర్లు పెంచాము. నర్సింగ్ ట్రైనింగ్ విద్యార్థులను రోగులకు అందించే వైద్య సేవలలో భాగంగా ఉపయోగించుకుంటున్నాము. సూపర్ స్పెషాలిటీ క్లినిక్స్ దగ్గర ప్రత్యేక ఓపికౌంటర్ ఏర్పాటు చేశాము.

సిటీ స్కాన్, ఎంఆర్ఐ వంటి టెస్టులకు ఎక్కువ సమయం పడుతోంది..వాటిని ఎలా పరిష్కరిస్తున్నారు?

సూపరింటెండెంట్ : పాక్స్ సాఫ్ట్వేర్ ఏర్పాటు



చేసాము. ఎక్సరే, సిటీ స్కాన్, ఎమ్మార్ఐ వంటివి పరీక్షలకు రిపోర్టు, ఫిలిం రావాలంటే చాలా సమయం పడుతుంది. ఈ సాఫ్ట్వేర్ వల్ల డాక్టర్ ఫోన్‌లోనే వాట్సప్ ద్వారా అందించే రిపోర్టును వెంటనే చూసుకోవడానికి అవకాశం ఉంటుంది. దీంతో రోగికి చికిత్స త్వరగా అందించడానికి అవకాశం ఉంటుంది.

మందుల కొరత ఏమైనా ఉందా?

సూపరింటెండెంట్ : మందులు, ఇంజక్షన్లు కొరత లేకుండా ఇండెంట్ పెట్టి తెప్పించుకోవడం జరుగుతుంది. సర్జికల్‌కు సంబంధించినవి మన దగ్గర లేకపోతే వాటిని మాత్రం బయట కొనమని చెప్తున్నాము. బడ్జెట్ సరిపోకపోవడంతో ఇలా చెప్పాల్సి వస్తుంది.

కొత్త బిల్డింగుల నిర్మాణ ఆగిపోయింది. దానికోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

సూపరింటెండెంట్ : ఆస్పత్రి నిర్మాణం పనులు బిల్లుల బకాయిలతోటి కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. దీనిని జిల్లా మంత్రి భరత్, వైద్య ఆరోగ్య శాఖ దృష్టికి తీసుకెళ్లాము. మంత్రి టిజీ భరత్ దీని పై సీరియస్ గా దష్టి సారించి ముఖ్య మంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుంచి నిధులు రాబట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. దీని నిర్మాణం పూర్తి అయితే 658 బెడ్స్, మేజర్ ఆపరేషన్ థియేటర్స్, క్రిటికల్ కేర్ యూనిట్స్, పార్కింగ్ అందుబాటులోకి వస్తాయి. పాత భవనాల్లో కొనసాగుతున్న వైద్య సేవలను కొత్త భవనంలోకి మార్చుకోవచ్చు.

ఆసుపత్రి అభివృద్ధిపై భవిష్యత్తు ప్రణాళిక ఏమిటి?

సూపరింటెండెంట్ : పార్కింగ్ స్థలాలను గుర్తించాము. డాక్టర్స్ కు, సిబ్బందికి, సహాయకులకు వేరువేరుగా ఉండేలా ప్లాన్ చేస్తున్నాము. అత్యవసర చికిత్సకు క్రిటికల్ కేర్ యూనిట్ బెడ్స్ పెంచడం చాలా అవసరం. బయట లక్షల విలువ చేసే ఆపరేషన్స్ మరియు అరుదైన ఆపరేషన్లను చిన్న కోతతో కూడా జిజిహెచ్ వైద్యులు నిర్వహిస్తున్నారు. వాటిని మరింత పెంచాలని అందుకు అవసరమైన సహకారం కూడా అందిస్తున్నాము.



సైన్స్‌ను రాజకీయం చేయొద్దు

- పిటిఎఫ్ఇ వల్ల హాని లేదని నిరూపించాలి

- ప్రజల అభ్యంతరం తెలుసుకోవడానికి ఇబ్బంది ఏమిటి..?

- పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ కె.బాబూరావు

ప్రజాశక్తి-కర్నూలు క్రైం

తాను సైన్స్ విషయాలు చెబుతుంటే అసత్య ప్రచారం చేస్తున్నారని అంటున్నారని, సైన్స్‌ను రాజకీయం చేయొద్దని ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ కె.బాబూరావు పేర్కొన్నారు. టిజివి పరిశ్రమ విస్తరణలో ఉత్పత్తి చేసే రసాయనాల ప్రభావంపై ఆదివారం కర్నూలులోని బ్రహ్మారెడ్డి కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ ఆధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు పిటిఎఫ్ఇ ఉత్పత్తి, రసాయనాల ప్రభావంపై వివరించారు. మోడీ ప్రభుత్వం పర్యావరణ చట్టాల్లో మార్పులు చేసి చట్టాలు పనికిరాకుండా చేశారన్నారు. పిటిఎఫ్ఇ ఉత్పత్తి 1950 నుంచి అమెరికాలో ప్రారంభమైందన్నారు. పిటిఎఫ్ఇ తయారీ చాలా క్లిష్టమైన ప్రక్రియని, అనువులణు జోడించి తయారు చేస్తారని తెలిపారు. ఆ ప్రక్రియలో సర్ఫాక్టెంట్స్ ఖచ్చితంగా వాడతారని, టిజివి పరిశ్రమ విస్తరణ పర్యావరణ నివేదికలో వాటి గురించి ప్రస్తావనే లేదని చెప్పారు. పిటిఎఫ్ఇ తయారీలో పిఎఫ్ఓఎ (పెర్‌ఫ్లోరో ఆక్టానిక్ యాసిడ్) వాడతారని, అది చాలా ప్రమాదకరమని తెలిపారు. కర్నూలు మండలం గొందిపర్లలోని టిజివి ఎస్ఆర్ఎఎసి పరిశ్రమ విస్తరణలో భాగంగా పిటిఎఫ్ఇ (పాలీటెట్రా ఫ్లోరో ఇథలీన్) ఉత్పత్తికి వాడే రసాయనాల వల్ల హాని లేదని శాస్త్రీయంగా నిరూపించాలని డిమాండ్ చేశారు. టిజివి పరిశ్రమలో అది వాడటం లేదని, దానికి ప్రత్యామ్నాయంగా ఇతర రసాయనాలు వాడతామని చెబుతున్నారన్నారు. పిఎఫ్ఓఎకు ప్రత్యామ్నాయంగా వాడే ఫ్లోరిన్ రసాయనాలు, హెచ్‌పిఎఫ్ఓ డైమర యాసిడ్ కూడా ప్రమాదకరమేనన్నారు. ఆ రసాయనాల వల్ల మూత్రపిండాల, వృషణాల కేన్సర్లు, ఇతర కేన్సర్లు, శ్వాసకోశ ఇబ్బందులు, దీర్ఘకాలిక రోగాలు వస్తాయని వివరించారు. బలభద్రపురంలో కేన్సర్ ఉధృతి పెరిగిందని, ఇక్కడ కూడా అలాంటి పరిస్థితే ఉంటుందని తెలిపారు. గుజరాత్‌లో పిటిఎఫ్ఇ విషవాయువులు పీల్చి నలుగురు చనిపోయారని, పిటిఎఫ్ఇ వల్ల ప్రమాదాల గురించి అనేక అధ్యయనాలు చెబుతున్నాయని తెలిపారు. తెలంగాణ సరిహద్దుల్లో ఉన్నప్పుడు వాళ్ల పాత్ర లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేస్తారని, ప్రజల అభ్యంతరాలు తెలుసుకోవడంలో ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. పిటిఎఫ్ఇకి మండే స్వభావం ఉందని, పేలుడు జరిగే ప్రమాదం ఉందని తెలిపారు. నాన్ ఫ్లోరినేటెడ్ పద్ధతుల్లో పిటిఎఫ్ఇ తయారీకి ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ప్రజల నుంచి అడ్డుకట్ట పడితేనే అనుమతులు రాకుండా ఆగుతాయన్నారు. జన విజ్ఞాన వేదిక జాతీయ నాయకులు మహమ్మద్ మియా



మాట్లాడుతున్న పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ కె.బాబూరావు

మాట్లాడుతూ పూర్వీకులు ఇచ్చిన భూమిని, వాతావరణాన్ని కాపాడుకోవాలని కోరారు. సదస్సులో ప్రజాస్వామ్య సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి, నాయకులు రత్నం ఏసేపు, జి.రామకృష్ణ, ఎండి ఆనంద్‌బాబు, డేవిడ్, చంద్రశేఖర్ రెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బిసి విద్యార్థులు విద్యకు దూరం

హాస్టల్లో సీట్లు లేవంటూ తల్లిదండ్రులు ఆవేదన

ప్రజాశక్తి-పత్తికొండ

నియోజకవర్గ, రెవిన్యూ డివిజన్ కేంద్రమైన పత్తికొండలో బిసి విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్న విద్యార్థులు కష్టాలు మారడం లేదు. పత్తికొండ , తుగ్గలి మద్దికేర, క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాలను కలుపుకొని పత్తికొండను నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేశారు. కర్నూలు జిల్లాలో విద్య, వైద్యం ఉపాధి కల్పనలో అత్యంత వెనుకబడిన

నియోజకవర్గం పత్తికొండ బీసీలు అధికంగా ఉన్న నియోజకవర్గం పత్తికొండ. పత్తికొండ ప్రాంత ప్రజలు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ప్రతి ఏటా వర్షాలు పడక సాగుచేసిన పంటలు చేతికి రాక చేసిన అప్పులు తీర్చలేక రైతులు అనేక ఇబ్బందులు పడుతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. చేసిన అప్పులు తీర్చడానికి కుటుంబంతో పాటు చదువుకుంటున్న విద్యార్థులను ఉపాధి కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్న సమస్యలు విద్యార్థులను వెంటాడుతున్నాయి. విద్యార్థులు చదువుకోవడానికి కనీస హాస్టల్లో సదుపాయాలు కల్పించుకోవడం ప్రభుత్వాల వైఫల్యం, స్వార్థ రాజకీయాలతో రాజకీయ పార్టీ నాయకులు పబ్బం గడుపుతున్నారని విద్యార్థి సంఘాలు మండిపడుతున్నాయి.

అసలు సమస్య ఇక్కడే మొదలైంది..

కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 2010లో జీవో నెంబర్ 50 తీసుకొచ్చి సమీకృత సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం సముదాయం అనే పేరుతో కేటగిరీలు వారిగా ఎస్‌సి 126, ఎస్‌టి 107, బీసీ 126, మైనార్టీ 4, క్రిస్టియన్ 16, ఇతరులు 27 లను కలుపుకొని 400 సీట్లను కేటాయించింది. అందులో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో పత్తికొండ, ఆలూరు, గూడూరు, ఆవుకు మండలాల్లోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలుగా ఏర్పాటు చేసింది. క్రిష్ణగిరి మండలంలోని కంబలపాడు , మద్దికేర మండలంలోని బిసి బాలుర వసతి గృహాలు ఉన్నా మౌలిక సదుపాయాలు లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.బిసి హాస్టల్ ఉన్నచోట ఎస్‌సి విద్యార్థులు సీట్లు లేవు. ఎస్‌సి హాస్టల్ ఉన్నచోట బిసి విద్యార్థులకు సీట్లు లేవంటూ వార్డెన్లు వాపోతున్నారు.

శిధిలావస్థలో బిసి బాలికలు వసతి గహం

పత్తికొండలో బిసి బాలికల వసతి గృహం శిథిలా వ్యవస్థకు చేరింది. ఒకే భవనంలో 4వ తరగతి నుండి 10 , ఇంటర్ బాలిక విద్యార్థులు కలిపి 200 మందికి వసతి కల్పిస్తున్నారు. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యంతోనే విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ఎప్పుడు ఏం జరుగుతుందో అని బాలికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీస అవసరాలు తీర్చుకోవడానికి మౌలిక సదుపాయాలు లేవంటూ బాలికల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నిరుపయోగంగా ఎస్‌టి వసతిగృహం

నిరుపయోగంగా ఎస్‌టి వసతిగృహం...

పత్తికొండలో ఎస్‌టి విద్యార్థుల కోసం వసతిగహం ఉండేది. 2010 సంవత్సరంలో కుల, మత, వర్గ విభేదాలు లేకుండా సమీకృత వసతి గృహం సముదాయం పేరుతో హాస్టళ్లను విలీనం చేశారు. అప్పటినుండి ఎస్‌టి హాస్టల్ నిరూపియోగంగా ఉండడంతో పాటు శిధిలా వ్యవస్థకు చేరింది. ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తికొండలో బిసి బాలుర, బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలి



పత్తికొండలోని బాలుర, బాలికల వసతి హాస్టల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వ అధికారులకు, రాజకీయ పార్టీ నాయకులకు, ప్రజా ప్రతి నిధులకు విన్నవించుకున్న పట్టించు కున్న పాపాన లేదు. హాస్టల్ వసతి లేకపోవడంతో అనేకమంది విద్యార్థులు విద్యకు దూరమవుతున్నారు. ప్రస్తుత బాలికల హాస్టల్ లో మౌలిక సదుపాయాలు లేవు

- ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి రంజిత్ రెడ్డి.

నేడు నగరపాలకలో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ యస్.రవీంద్ర బాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారన్నారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా స్థానిక సమస్యలుంటే, లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కూటమి పాలనను ఎండగడదాం

- వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, జిల్లా పరిశీలకులు గంగుల ప్రతాపరెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్ : వైసిపి కర్నూలు జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎస్‌వి.మోహన్‌రెడ్డి అధ్యక్షతన కర్నూలు నగరంలోని లక్ష్మీ కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, జిల్లా పరిశీలకులు గంగుల ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. కూటమి పార్టీలు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం, అధికారంలోకి వచ్చాక మోసపూరిత పాలన సాగించడాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా రూపొందించిన 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో'ను క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ప్రజలకు అందించడానికి ప్రారంభించారు.'బాబు మ్యారిటీ - మోసం గ్యారంటీ'అనే నినాదంతో ప్రజలలో చైతన్యం రేకెత్తించాలని పిలుపునిచ్చారు. రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి, జిల్లా పరిశీలకులు గంగుల ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల ముందు అలవికాని హామీలతో ప్రజలను నమ్మించారని, ఇంటింటికీ హామీల బాండ్లు పంపించి అధికారంలోకి వచ్చారన్నారు. ఒక్క హామీకి కూడా న్యాయం చేయలేదని ధ్వజమెత్తారు. 'సూపర్ సిక్స్' పేరుతో ప్రజలను మభ్యపెట్టారని, హామీలు నెరవేర్చమంటే మక్కులు విరగ్గొడతామంటున్న పవన్ కళ్యాణ్‌కు ప్రజలే గట్టి సమాధానం చెబుతారన్నారు. జిల్లా అధ్యక్షులు ఎస్‌వి మోహన్ రెడ్డి మాట్లాడుతూ, ఒక్కో ఇంటికీ రూ.2.40 లక్షలు జమ అవుతాయంటూ బాండ్లు ఇచ్చిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇప్పుడు ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పలేని స్థితిలో ఉన్నారని అన్నారు. కొత్త పరిశ్రమలు వచ్చాయంటూ పచ్చ పత్రికల్లో పెయిడ్ ఆర్టికల్స్ వేయించుకున్నారని, వాస్తవానికి ఒక్క పరిశ్రమైనా తెచ్చారా అని నిలదీశారు. నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి, కర్నూలు జిల్లా మేయర్ బివై రామయ్య, పత్తికొండ మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఎమ్మిగనూరు ఇంచార్జ్ బుట్టా రేణుక, కోడుమూరు ఇంఛార్జ్ ఆదిమూలపు సతీష్, కర్నూలు మాజీ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, ఎమ్మెల్సీ మధుసూదన్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించాలి

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్ : క్రమశిక్షణకు మారుపేరు తైక్వాండో అనీ అలాంటి క్రీడలో విద్యార్థులు రాణించాలని ఒలింపిక్ సంఘం కార్యదర్శి జి.శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. కర్నూలు కృష్ణానగర్‌లో ఆదివారం జరిగిన తైక్వాండో బెల్ట్ టెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిభావంతులకు ఆరెంజ్, ఎల్లో, గ్రీన్, బ్లాక్ బెల్టులను ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ బెల్ట్ టెస్టులకే పరిమితం కాకుండా రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పాల్గొనే అవకాశాన్ని సంపాదించాలన్నారు. కార్యక్రమంలో విరామ ఉద్యోగి మల్లికార్జున, తైక్వాండో శిక్షకులు రాంబాబు, శివకుమార్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కు తీసుకోవాలని నేడు బహిరంగ సభ

- జయప్రదం చేయాలని జెఎసి పిలుపు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

వక్ఫ్ చట్ట సవరణను వెనక్కి తీసుకోవాలని సోమవారం ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశామని, దానిని జిల్లా, నగర ప్రజలందరూ జయప్రదం చేయాలని జెఎసి కన్వీనర్ సయ్యద్ జాకీర్ అహ్మద్ రషది, కో కన్వీనర్లు, ఎస్ఎండి షరీఫ్, ఎంఎ హమీద్, అమానుల్లా, మొహమ్మద్ బాషా, జహంగీర్, ఖాదర్ భాష తదితరులు కోరారు. కేంద్రంలోని బిజెపి నాయకత్వంలో నరేంద్ర మోడీ నిరంకుశంగా, ప్రజలకు వ్యతిరేకంగా పరిపాలన చేస్తా ఉన్నారని వారు విమర్శించారు. బడా పారిశ్రామిక వ్యక్తులకు అంబానీ, అధానీలకు విజయ మాల్యా లాంటివారికి ఊడిగం చేస్తా ఉన్నారని దుయ్యబట్టారు.అందులో భాగంగానే ముస్లిం మైనార్టీలకు వ్యతిరేకంగా వక్ఫ్ చట్ట సవరణను తీసుకొని వచ్చి వారి భూములను, పేపర్ల పేరుతో మసీదులను, ఈద్గాలను , కబరస్తాన్ లను మదరసాలను వారి వశం చేసుకోవాలని, వారి కావలసిన వ్యక్తులకు ఇవ్వాలనే తాపత్రంతో కుట్ర



మాట్లాడుతున్న జెఎసి నేతలు

పొందుతున్నా రని ధ్వమెత్తారు. ముస్లిం మైనారిటీలకు భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. బహిరంగ సభలో ప్రజానీకం అందరు కూడా పెద్ద ఎత్తున పాల్గొని, విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ అధ్యక్షులు ఫకిహుల్ హజరత్ మౌలానా ఖాలీద్ షఫీ ఉల్లా రహమాని సహెబ్, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ గౌరవ సభ్యులు జనాబ్ బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ, జమ అయితే అహలె హదీస్ అధ్యక్షులు హైదరాబాద్ హజరత్ మౌలానా అబ్దుర్ రహిం ఖురామ్ , ముఫీకిరం ఇస్లాం హజరత్ మౌలానా ముఫ్తీ ఖలీల్ సహెబ్, జామియా నిజామీయా అధ్యక్షులు తదితరులు పాల్గొని ప్రసంగి స్తారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలు హిందూ, ముస్లిం, ఈసాయి సిక్ పురుషలు, మహిళలులందరూ పాల్గొని విజయవంతం చేయాలని, మహిళలకు ప్రత్యేకమైన పరదా ఏర్పాటు చేయడమైనదని వారు తెలిపారు.

సమాజ ఐక్యతకు సాహిత్యం దోహదం

- రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సాహిత్యమే సమాజాన్ని కలుపుతుందని, సాహిత్యకారులు చేసే రచనలు ఈ సమాజ ఐక్యతకు, దేశ అభివృద్ధికి ఎంతగానో దోహద పడతాయని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. కర్నూలు పింగళి సూరన తెలుగు తోటలో జరిగిన 'భవ్య భావాల గని మా భవాని లీలావతమ్మ' అన్న స్మృతి సంచికను ఆయన ఆవిష్కరించారు. కురాడి కల్కూర చంద్రశేఖర్ అధ్యక్షతన నరసం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. నరసం కార్యక్రమాలో చురుకైన వ్యక్తి భవానీ లీలావతమ్మ స్మృతికి వారు స్మృత్యంజలి సమర్పించారు. తొలుత అతిధులందరు లీలావతి చిత్రపటానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఐరోపాదేశీ యాత్రల గురించి సిల్వర్ జూబ్లీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ జీవి.రమణయ్య వివరించారు. భవాని లీలావతమ్మ స్మృతి సంచికను గురించి డాక్టర్ దండేబోయినపార్వతీదేవి మాట్లాడారు. లీలావతమ్మ స్నేహశీలి అన్నారు. సాహిత్య కార్యక్రమాల్లో రచనలో సమీక్షలు కవిసమ్మేళనాలు చాలా చక్కగా వ్యవహరించే



'భవ్య భావాల గని మా భవాని లీలావతమ్మ' సంచికను ఆవిష్కరిస్తున్న పుల్లయ్య తదితరులు

రచయిత్రి అన్నారు. దేశభక్తి తెలుగుభాష పట్ల విశేష అనురక్తి, సాహిత్యం పట్ల అభిలాష ఆమె సీసపద్యాలలో విశేషంగా కనిపిస్తుందని తెలిపారు. టిజివి కళాక్షేత్ర అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ స్మృతి సంచికను తీసుకురావడం ఒక మంచి సంప్రదాయమని, ఇది రచయితను జీవింప చేస్తుందని అన్నారు. నంద్యాలకు చెందిన తెలుగు ఉపాధ్యాయురాలు భవాని లీలావతి ప్రమాదవశాత్తు ఆకస్మిక మరణం చెందారన్నారు. నరసం కర్నూలు అధ్యక్షులు కావెం సుబ్బలక్ష్మి మాట్లాడుతూ ఆమె రచనలు అన్నిటిని ఒకచోట చేర్చి ఒక సంకల్పాన్ని తీసుకురావడం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు. ఆమె మన మధ్యనే ఉన్నట్లుగా అక్షరాలు నిలిచి ఉన్నంతకాలం ఆమె జ్ఞాపకాలు చెదిరిపోవని అన్నారు. లీలావతి కుమారులు, కోడళ్ళు, బంధుమిత్రులు, మనవళ్లు, మనవరాలు రావడం విశేషమన్నారు. సులభ సుందరంగా ఉండేటువంటి చక్కటి రచన శైలి విశేషం పద సంపద చక్కటి భావవ్యక్తీకరణ సామాజిక ప్రేమ లీలావతి రచనల్లో ఉన్నాయని జెఎస్ఆర్‌కె శర్మ అన్నారు. సదస్సులో డిఎస్‌పి మహబూబ్ బాషా, పద్మావతి, సునీత చంద్రమౌళిని, నీలిమ, హైమావతి రుక్మిణి, సీతామహాలక్ష్మి, లీలావతి వారి కుటుంబ సభ్యులు రవి కళ్యాణ్ తదితరులు మాట్లాడారు.

పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- నేడు కలెక్టరేట్ ముందు ఆందోళన

- రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

పొగాకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కార్యాలయం ముందు సోమవారం జరిగేటువంటి ఆందోళనలో పొగాకు రైతులందరూ పాల్గొనాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. రామకృష్ణ పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లాలో ఖరీఫ్లో వేసిన పంటను ప్రభుత్వమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక కర్షక భవన్లోని రైతు సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో జి.రామకృష్ణతో పాటు జిల్లా సహాయ కార్యదర్శులు కోటకొండ సూరి, ఏ.కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పొగాకు పంటకు గత సంవత్సరం బాగా రేటు ఉండడం వలన ఈ సంవత్సరం విస్తారంగా రైతులు పొగాకు పంటను సాగు చేశారు .దీన్ని అదునుగా చూసుకుని కంపెనీలు రైతులను నట్టేట ముంచారు. ప్రతి రైతు దగ్గర క్వింటాళ్లకు క్వింటాళ్లు పొగాకు నిల్వలు అట్లే ఉన్నాయి పొగాకు అమ్ముడపోకపోవడం చేత రైతులు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడు చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తామని చెప్పుతున్నారు తప్ప ఒక అడుగు కూడా ముందుకు పడలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు పంటను కొనుగోలు చేసే దానికి 273 కోట్ల రూపాయలు విడుదల చేశామని ప్రకటించారు. అవి ఎక్కడున్నాయి ఎవరి ఖాతాలో జమయ్యాయి తెలియదు. రైతులు నష్టపోకుండా ఇప్పటికైనా తక్షణమే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగే ఆందోళన కార్యక్రమానికి పొగాకు రైతులందరూ స్వచ్ఛందంగా రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కోటకొండ సూరి ఏ. కష్ణ మాట్లాడుతూ రైతుల మనోవేదనలు ప్రభుత్వం అర్థం చేసుకోవాలని రైతు ప్రభుత్వం అనే చెప్పే వారు రైతులను గురించి పట్టించుకోకపోవడం అన్యాయమని వారు అన్నారు. అనేక గ్రామాలలో పొగాకు నిలువలు అట్లే ఉన్నాయని వారు తెలిపారు సోమవారం 10 గంటలకు జరిగే ఆందోళన కార్యక్రమానికి రైతులు కదిలి రావాలని విజ్ఞప్తి చేశారు.

దళితుల స్మశానం పాత రస్తాను కాపాడరూ.!

ప్రజాశక్తి - సి బెళగల్

సి బెళగల్‌లో దళితుల స్మశానం పాత రస్తా బురాన్ దొడ్డి రోడ్డులో నుండి ఉందని కాపాడాలంటూ పలువురు తహసీల్దార్‌కు మొర పెట్టుకొంటున్నారు. ఆ పాత కొండ అవతల నుండి స్మశానం మీదుగా బెళగల్ కు ఇవతలకు ఎంతో ఉపయోగకరంగా ఉంది.ఆ రోడ్డు ప్రస్తుతం ప్రక్కనే పొలం ఉన్న ఓ వ్యక్తి పొలంలోకి ఆక్రమించుకొనుట ద్వారా దారి రూపురేఖలు మారి పోయాయి.దారి అక్రమణ కానప్పుడు ఇటు వైపు స్మశానంలోకి వెళ్ళుటకు వీలుగా ఉన్నప్పటికీ ఆ పాత రస్తా నుండి ఈ ఎస్సి స్మశానం మీదుగా తూర్పు గట్టుకు ఆనుకొని దాసరయ్య గుహలకు, మల్లప్ప గుడికి, బ్రాహ్మంగారి గుడికి దారి సజావుగా వెళ్ళుటకు అవకాశం కలదు. అదే బెళగల్ రోడ్డు లో నుండి అలాగే ప్రభుత్వ కార్యాలయాల నడుమ నుండి మల్లప్ప గుడిని , దాశరయ్య గుహలను,బ్రాహ్మం గారి గుడిని సందర్శించాలంటే కొండ ప్రాంతంలో దారులు ఏబ్బేట్టుగా ఉన్నాయి. అలాగే పాత రస్తా గుండా చెరువులో నుండి మూగ జీవాలు ఆవులు, బర్రెలు, మేకలు, గొర్రెలు ఇంటికి, ఇంటి నుండి మేత కోసం అనువుగా ఉండే ఈ దారి దిక్కుగా అయ్యింది.కావున పాత రస్తాను కాపాడాలని వాపోతున్నారు.

ఆదర్శ గురువు జంబులింగయ్య

- విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు కృషి - ఆశు కవిత్వంలో దిట్ట
- ఉపాధ్యాయ సమస్యలపై పోరాటాలు

ప్రజాశక్తి - ఆలూరు

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేస్తూ యం.జంబులింగయ్య ఆదర్శ గురువుగా గుర్తింపు తెచ్చుకున్నారు. పేద విద్యార్థులు ఉన్నంతగా చదవాలని అకాంక్షతో పాటు ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం యుటిఎఫ్ పోరుబాట ఎంతో అండగా నిలిచారు. విద్యార్థి దశ నుంచే కవిత్వం పై మక్కువ ఉండడంతో ఆశు కవిత్వంలో దిట్టగా పేరొందారు. పదవి విరమణ చేస్తున్న ఆలూరు పట్టణంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల(4వార్డు) ప్రధానోపాధ్యాయుడు యం.జంబులింగయ్య పదవి విరమణ చేస్తున్న సందర్భంగా ప్రజాశక్తి అందిస్తున్న ప్రత్యేక కథనం...



ఆస్పరి మండలం తంగరడోణ గ్రామానికి చెందిన మహాదేవమ్మ, చిన్న రామలింగయ్య దంపతులకు కుమారుడు జంబులింగయ్య. ఎమ్మిగనూరు పట్టణం లో విద్యాభ్యాసం చేసి 1977లో ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. మొదటిగా ఆదోని మండలం బల్లెకల్లు పాఠశాలలో చేరారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు : ఆలూరు పట్టణంలో ఎంపిపిఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సేవలను గుర్తించి జిల్లా విద్యాశాఖధికారి 2023లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డును ప్రకటించగా అప్పటి జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ నారపురెడ్డిమౌర్య, ఎమ్మెల్యేలు హఫీజ్ ఖాన్,రాంభూపాల్ రెడ్డి, డిఇఒ రంగారెడ్డి చేతులమీదుగా ఎం.జంబులింగయ్య అవార్డును, షీల్డ్‌ను అందుకున్నారు. సుల్తానాపురం పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో సేవలకు గుర్తింపుగా స్కూల్ కాంప్లెక్స్ లెవెల్ బెస్ట్ టీచర్ అవార్డు పొందారు. ఇదే గ్రామ పాఠశాలలో పిల్లలకు చదువు బాగ చెబుతుండడంతో ఆదోని పట్టణంలోని ప్రయివేటు పాఠశాలలో చదివిస్తున్న 70మంది పిల్లలను స్థానిక సుల్తానాపురం పాఠశాలలోనే చదివేలా ముందుకు రావడం ఎంతో గొప్ప విషయం. నాగనాథనహళ్లి ప్రాథమిక పాఠశాలకు ఆదర్శ మిత్ర మండలి సహకారంతో డిజిటల్ ప్రొజెక్టర్ ను విరాళంగా వచ్చేందుకు కృషి చేశారు. నాగనాథనహళ్లి ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటించి పచ్చదనంతో స్కూలును ఎంతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.

యుటిఎఫ్ నాయకునిగా: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారము కోసం జరిగిన ఎన్నో ఉద్యమాలలో పాల్గొన్నారు. యుటిఎఫ్ సంఘంలో 25ఏళుగా పని చేస్తున్నారు. యుటిఎఫ్ ఆదోని మండల కార్యదర్శి గా, ఆలూరు మండల గౌరవ సలహాదారుణిగా పనిచేశారు.

ఆశు కవిత్వంలో దిట్ట: మాటల సందర్భంలో తనలోనే ఆశు కవిత్వాన్ని బయటపెడుతుంటారు. వరకట్న నిషేధం,కూలీలపై తదితర ఆశు కవిత్వాలు రాశారు.

ఎంతో సంతప్తిగా ఉంది: తన 29 ఏళ్ళ ఉపాధ్యాయ జీవితం ఎంతో తృప్తిగా ఉందన్నారు. తాను చదువు చెప్పిన పిల్లలు ఎంతో మంది ఉన్నత స్థాయికి చేరారు. తాను ఎదుగుదలలో అన్న విరుపాక్షయ్య స్వామి, నా భాగస్వామి సుజాత సహకారం మరువలేనిది.

టిడిపిలో కుదరని సఖ్యత

- భర్తీ కాని నామినేటెడ్ పోస్టులు
- తలలు పట్టుకుంటున్న ఆశాహులు

ప్రజాశక్తి- ఆదోని

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచిన టిడిపిలో నాయకుల మధ్య సఖ్యత కుదరలేదు సర్ది చెప్పి సరి చేయాల్సిన అధిష్టానం చూసి చూడనట్లు వివారిస్తూ చోద్యం చూస్తోంది. నామినేటెడ్ పదవులు ఆశించే ఆశాహువులు మాత్రం తలలు పట్టుకుంటున్నారు అన్ని ప్రాంతాలలో నామినేటెడ్ పోస్టులు భర్తీ జరిగి ఇప్పటికే అధికారం చేలాయిస్తున్నారు...

ఉమ్మడి ఆదోని రెవిన్యూ డివిజన్ లో టిడిపి లో నాయకుల మధ్య ఆగాదం రోజురోజుకు పెరుగుతుంది ఆదోని నియోజకవర్గం లో మాజీ ఎమ్మెల్యే ప్రస్తుత ఇన్చార్జి మీనాక్షి నాయుడు, సీనియర్ నాయకుడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ సూరం భాస్కర్ రెడ్డిలు ఇన్చార్జి పదవిని ఆశిస్తున్నారు. ప్రస్తుతం మీనాక్షి నాయుడు సారథ్యంలో టిడిపి కార్యక్రమాలు జరుగుతున్నాయి అధికారికంగా తమకే త్వరలో టిడిపి ఇన్చార్జి బాధ్యతలు వస్తాయని టిడిపి సీనియర్ నాయకుడు సూరం భాస్కర్ రెడ్డి వర్గీయులు గట్టి నమ్మకంతో ఉన్నారు. శుక్రవారం టిడిపి అబ్జర్వర్ సమక్షంలోనే నాయకుల అనుచర వర్గాల మధ్య మాట మాట చోటుచేసుకుందని తెలిసింది. ఇలాగే గ్యాప్‌గా వ్యవహరిస్తే వర్గాలు మరింత ఏర్పడి సమస్యలు తలెత్త అవకాశం లేకపోలేదని పలువురు చెబుతున్నారు. ఆదోని నియోజకవర్గం లో వ్యవసాయ మార్కెట్ యార్డ్, సింగిల్ విండో చైర్మన్ పదవులు ఇప్పటికీ భర్తీ కాలేదు ఇతర ప్రాంతాలలో పదవులు చేపట్టి నెలలు గడుస్తున్న ఇక్కడ మాత్రం పదవులు భర్తీ కాకపోవడంతో కూటమిలోని ద్వితీయ శ్రేణి నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఆదోని నియోజకవర్గంలో మధిరే సింగిల్ విండ్ ఉంది. పదవులు ఆశించే వారి సంఖ్య పదుల సంఖ్యలో ఉంది పూర్తి వివరాలు బయోడేటాలు సమర్పించామని తమ వివరాలు అధిష్టానం సేకరించి సిద్ధం చేసిందని ప్రకటన మాత్రమే తరువాయని కొందరు చెబుతున్నారు. జిల్లా మొత్తం సింగల్ విండో చైర్మన్ సభ్యుల పదవులను శనివారం ప్రభుత్వం ప్రకటించింది ఆదోని నియోజకవర్గంలోని మదిరె, ఆలూరు నియోజకవర్గంలో ఆస్పరి ఆలూరు,హాలహర్వి చిప్పగిరి సింగిల్ విండో చైర్మన్, సభ్యుల పేర్లు ప్రకటించకపోవడంతో నిరాశకు లోనవుతున్నారు. ఆలూరు నియోజకవర్గంలో గత ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలైన వీరభద్ర గౌడ్ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆలూరి ఇంచార్జి తమకే వస్తుందని వైకుంఠం జ్యోతి వర్గీయులు చెబుతున్నారు. నెలలు గడుస్తున్న ఇన్చార్జిల వ్యవహారం తేలక పోవడంతో నువ్వా నేనా అన్న రీతిలో వేరువేరుగా కార్యక్రమాలు నిర్వహించిన సందర్భాలు ఉన్నాయి. ఆదోని నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత ఎన్నికలు కూడా నిర్వహించలేదు. గ్రామ వార్డు మండల పట్టణ అధ్యక్ష కార్యదర్శులు కార్యవర్గము యువత ఎస్సీ బీసీ మైనార్టీ సెల్ అధ్యక్ష కార్యదర్శి కార్యవర్గం ప్రకటించలేదు. సంస్థాగత ఎన్నికలు కూడా అన్ని ప్రాంతాలలో జరిగిన ఇక్కడ జరగక పోవడంతో కార్యకర్తలు నిరుత్సాహంతో ఉన్నారు. అధికారం రాక మునుపు ఎలా ఉన్నా పార్టీ అధికారంలోకి వచ్చిన ఇలా గ్రూపులుగా వ్యవహరించడం వల్ల కార్యకర్తలు నష్టపోతున్నారని చెబుతున్నారు. త్వరలోనే అధికారికంగా ఆదోని ఆలూరు నియోజకవర్గ ఇన్చార్జి బాధ్యతలు వెలబడతాయని అంతవరకు నామినేటెడ్ పదవులు వచ్చే అవకాశం లేదని పలువురు చెబుతున్నారు. ఆదోని నియోజకవర్గం లో బిజెపి ఎమ్మెల్యే పార్థసారథి కూడా ప్రభుత్వ పథకాలు వారి కార్యకర్తలు లబ్ధి చేకూరే ఏజెన్సీ నిర్వహణలో సింహభాగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. టిడిపిలో వర్గాలు ఉండటం వల్ల వారు సఖ్యత కొరవడిన కారణంగా టిడిపి కార్యకర్తలు అన్ని విధాలుగా నష్టం జరుగుతుందని వాపోతున్నారు. అధిష్టానం జోక్యం చేసుకొని నాయకులను ఐక్యం చేసి కార్యకర్తల్లో నెలకొన్న గందర గోల పరిస్థితులను తేట తెల్లం చేసి వర్గ విభేదాలకు తెర పడేలా చూడాలని కోరుతున్నారు.

కురువలపై టిడిపి చిన్నచూపు

డైరెక్టర్ పదవికి రాజీనామా

ప్రజాశక్తి - కౌతాళం



కూటమి ప్రభుత్వంలో మంత్రాలయం టిడిపి అధిష్టానం కురువలకు చిన్న చూపు ఇస్తుందని కురువ సంఘం కర్నూలు జిల్లా కార్యదర్శి, కౌతాళం మండలం కురువ సంఘం అధ్యక్షులు కురువ వీరేష్ ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రాలయం నియోజకవర్గంలో నీ నాలుగు మండలాలలో ఉన్న 7 సహకార సంఘాల సొసైటీ లలో కురువలకు ఒక్క సొసైటీ చైర్మన్ పదవి ఇవ్వకుండా, అవమానపరిచిందని ఆవేదన వ్యక్తం చేశారు. కౌతాళం సహకార సంఘం లో తనకు డైరెక్టర్ గా ఇచ్చిన పదవికి రాజీనామా చేసినట్లు ప్రకటించారు. నియోజకవర్గం లో 30 వేల నుంచి 35 వేల దాకా కురువలు ఓటర్లుగా ఉన్నారని ఇంతమంది ఓటర్లు ఉన్న నియోజకవర్గ నామినేటెడ్ పోస్టులకు అర్హత కల్పించకుండా చిన్న చూపు చూడడం తగదని హెచ్చరించారు. గత ప్రభుత్వ పాలకులు కురువలకు మండల స్థాయిలో నియోజకవర్గ స్థాయిలో రాష్ట్రస్థాయిలో కూడా పదవులు కల్పించారని ఇప్పుడున్న మంత్రాలయం టిడిపి అధిష్టానం దాన్ని ఒకసారి గుర్తుచేసుకొని నాలుగు మండలాలలో అవకాశం ఉన్నచోట కురువలకు ప్రాధాన్యత ఇవ్వాలని లేనియెడల తెలుగుదేశం పార్టీకి తీవ్ర నష్టం కలిగే ప్రభావం ఉందని ఆరోపించారు.నాకు కౌతాళం సొసైటీ డైరెక్టర్గా అవకాశం కల్పించిన ఆ పదవికి నేను రాజీనామా చేస్తున్నట్లు పత్రికా సమావేశంలో ప్రకటించారు. రానున్న రోజుల్లో కురువలను ఇలాగే చిన్న చూపు చూసుకుంటూ పోతే తగిన మూల్యం చెల్లించుకుంటారని అన్నారు. ఈ విషయాన్ని టిడిపి పార్టీ నాయకులు గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కురువ సంఘం నాయకులు శివకుమార్ రమేష్ బీరప్ప అనూమేశ రంగస్వామి పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాణమే సిపిఐ లక్ష్యం

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు



మహాసభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర నాయకులు రామచంద్రయ్య

సమ సమాజ నిర్మాణమే సిపిఐ లక్ష్యమని ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి రామచంద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు నియోజకవర్గంలోని నందవరం, గోనెగండ్ల, ఎమ్మిగనూరు పట్టణం, ఎమ్మిగనూరు మండలాల 11వ సిపిఐ మహాసభలు అత్యంత ఉత్సాహభరితంగా నిర్వహించారు. వందలాది మంది ఎర్రజెండాలు పట్టుకొని, డప్పుల నృత్యాలు చేస్తూ, స్వాతంత్ర సమరయోధులు సర్దార్ భగత్ సింగ్, మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు, మతసామరస్య సామర శతకం సూచికగా హిందూ ముస్లిం క్రిస్టియన్ల వేషధారణలతో స్థానిక జూనియర్ కళాశాల నుండి సోమప్ప సర్కిల్ మీదుగా కుర్ని కళ్యాణమండపం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కుర్ని కల్యాణ మండపంలో ఎమ్మిగనూరు మండల సహాయ కార్యదర్శి రాజీవ్ అధ్యక్షతన ప్రతి నిధుల సభ నిర్వహించారు. ఎమ్మిగనూరు మండల కార్యదర్శి సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు చిన్నన్న జెండా ఆవిష్కరణ చేసి మహాసభలను ప్రారంభించారు. ఈ మహా సభకు ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి. రామచంద్రయ్య ,సిపిఐ కర్నూలు జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.ము నెప్ప మాట్లాడారు. పి రామచంద్రయ్య మాట్లాడుతూ 100 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీలు దేశంలో సిపిఐ, కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్నారు. అనేక పార్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి కాలగర్భంలో కలిసిపోయాయని అన్నారు. సిపిఐ జాతీయ మహాసభలు సెప్టెంబర్ మాసంలో పంజాబ్ రాజధాని లోని చండీగర్‌లో ఆగస్టు 20 నుండి 25వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. 28వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఒంగోలులో జులై 28 ,29, 30 తేదీలలో నిర్వహిచే 24వ కర్నూలు జిల్లా మహాసభలు మహాసభలకు రైతులకు , కార్మికులు, ఉద్యోగులు, అన్ని వర్గాల సిపిఐ అభిమానులు, నాయకులు పాల్గొనాలని కోరారు. ఈ మహాసభలకు ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి జి రంగన్న, పంపన్న గౌడ్, భాస్కర్ యాదవ్, విరుపాక్షి , కెసి జబ్బర్, దాదావాలి, బజారి,తిమ్మాపురం సిపిఐ సర్పంచ్ మహేశ్వరమ్మ, నాగన్న తదితరులు నాయకత్వం వహించారు.

ఐఎఎస్, ఐపిఎస్ కోచింగ్ కు తోడ్పాటు

ప్రజాశక్తి-ఆదోని

వ్యాపారమయమైన విద్య రంగంలో పేద విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు అందించడం అభినందనీయమని ముస్లిం మత పెద్ద అల్తాఫ్ హుస్సేన్ ఎమ్మిగనూరు చెందిన వ్యాపారవేత్త ఆల్‌ఫ్రైడ్రాజు తెలిపారు. ఆదివారం ఆదోని పట్టణంలోనే మిలాత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో ఐఎఎస్, ఐపిఎస్, యుపిఎస్‌సి కోచింగ్ కోసం ఎంట్రన్స్ పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి న్యాయవాది జీవన్‌సింగ్, కౌన్సిలర్ రఘునాథ్ రెడ్డి, సొసైటీ సభ్యులు ఇలియాస్ మునియార్, నియాజ్ హాజరయ్యారు. నిర్వాహకులు మాట్లాడారు ఐఎఎస్, ఐపిఎస్ యుపిఎస్ కోచింగ్ ఎంపిక కోసం ఎంట్రెన్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఢిల్లీ హైదరాబాద్ ఐఎఎస్, ఐపిఎస్ పరీక్ష కోచింగ్ సెంటర్లలో చదివేందుకు వసతి పుస్తకాలు కొనుగోలుకు సహకరిస్తామన్నారు. ప్రతి ఏడాది ఎంట్రన్స్ నిర్వహిస్తూ ప్రతిభవంతులను గుర్తించి వారి ఉన్నత చదువులకు సహకారం అందించడం జరుగు తుందన్నారు. ఈ పరీక్షకు ఆదోని, ఆలూరు, ఎమ్మిగనూరు, కోసిగి గుంటకల్లు ప్రాంతాలకు చెందిన 36 మంది గ్రాడ్యుయేట్లు హాజరయ్యారన్నారు. ఈ అవకాశాన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


ప్రశ్నాపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆల్‌ఫ్రైడ్‌రాజు, అదితరులు

భక్త జన సంద్రంగా రాఘవేంద్రస్వామి మఠం

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం భక్త జన సంద్రంగా మారింది. ఆదివారం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశంలో ఉన్న వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు గ్రామ దేవత మంచాలమ్మను రాఘవేంద్రస్వామి మూల బృందావనాన్ని దర్శించుకొనేందుకు బారులు తీరారు. శనివారం రాత్రి నుంచే ప్రైవేటు వాహనాల ద్వారా మంత్రాలయం చేరుకున్న భక్తులకు శ్రీ మఠం అద్దె గదులు దొరక్కపోవడంతో ప్రైవేటు లాడ్జీలను ఆశ్రయించి తమ జేబులను ఖాళీ చేసుకున్నారు. శ్రీ మఠం నిర్వహణలో ఉన్న సుమారు వెయ్యి పైగా రూములు ఉన్నప్పటికీ ఆన్‌లైన్‌లో గదులు బుక్ చేసుకున్న వారి కోసం ఒక రోజు ముందు గానే వారి కోసం తీసి పెట్టడం వల్ల శ్రీ రాఘవేంద్రస్వామి మఠం ఆదాయానికి గండి పడడంతో పాటు ముందుగా వచ్చిన భక్తులను ఇబ్బంది పెట్టే పరిస్థితి నెలకొంది. అలా కాకుండా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి కేవలం ఒక బ్లాక్‌లో కేటాయించి మిగిలిన బ్లాక్ ల్లో సాధారణ భక్తులకు కేటాయించవచ్చుకదా అని భక్తులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా శ్రీ మఠం అధికారులు చొరవ తీసుకుని భక్తులకు సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని భక్తులు కోరుతున్నారు.





ఉడుపిలో శ్రీమఠం పీఠాధిపతులు

ప్రజాశక్తి-మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధి పతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు ఉడుపి క్షేత్రాన్ని సందర్శించారు. ఆధ్యాత్మిక పర్యటనలో భాగంగా పుత్తిగే మఠం స్వామీజీ శ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామీజీ ఆహ్వానం మేరకు శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామీజీ ఉడుపిని చేరుకున్నారు. ఈ సందర్భంగా పుత్తిగె మఠం జూనియర్ పీఠాధి . పతులు శ్రీసుశ్రీంద్ర తీర్థస్వా మీజీ, సాం ప్రదాయ పద్ధతిలో స్వాగతం పలి కారు. ఉడిపి కృష్ణుడిని దర్శనం చేసు కొని మంగళ హారతులు స్వీకరించారు. శ్రీకృష్ణ మఠం ప్రాకారంలో బంగారు రథ నిర్మాణ పనులను ఆయన ప్రారం భించారు. ఈ శుభ సందర్భంగా శ్రీ సుగుణేంద్ర తీర్థ స్వామీజీ మూలరాములకు బంగారు హారాన్ని సమర్పించగా శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామీజీ కూడా భక్తికి చిహ్నంగా శ్రీ ఉడిపి కృష్ణుడికి పొడవైన హారాన్ని కూడా సమర్పించారు. ఈ నేపథ్యంలో భక్తులకు అనుగ్రహ సందేశంతో ఆశీర్వదించారు.


మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వై.ప్రదీప్‌రెడ్డి

మృతుని కుటుంబానికి 10 వేల ఆర్థిక సాయం

ప్రజాశక్తి- మంత్రాలయం

మండల కేంద్రంలోని రామచంద్రనగర్ కాలనీలోని ఎస్‌సి కాలనీలో మడ్డిరాజు భార్య మార్తమ్మ అనారోగ్యంతో మతి చెందింది. ఆదివారం విషయం తెలుసుకున్న వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మట్టి ఖర్చులకు గాను రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేసి ఓదార్చారు. ఆయన వెంట గ్రామ సర్పంచి తెల్లబండ్ల భీమయ్య నాయకులు అబ్రహం ఉన్నారు.

విద్యార్థి శతకం పుస్తకావిష్కరణ


ప్రజాశక్తి-పత్తికొండ



పత్తికొండలో షిరిడి సాయిబాబా ప్రాంగణంలో సవ్వప్ప గారి ఈరన్న స్థాపించిన కమలా కళానికేతన్ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో 40వ అష్టావధానము జనప్రియకవి ఏలూరి జంగన్న అధ్యక్షతన శతావధాని ఉప్పల దడియం భరత్ శర్మ అవధానం నిర్వహించారు. పత్తికొండ మాజీ ఎంపిపి నాగరత్నమ్మ ప్రారంభించారు. అనంతరం సవ్వప్ప గారి ఈరన్న రచించిన 74వ పుస్తకం 'విద్యార్థి శతకము' పుస్తకాన్ని పత్తికొండ మాజీ ఎంపిపి నాగరత్నమ్మ , కెడిసిసిబి మాజీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శిశ్రీ కొత్తపల్లి సత్యనారాయణ, అష్టవధాని భరత్ శర్మ చేతుల మీదుగా ఆవిష్కరించారు. అవధానంలో పృచ్ఛకులుగా గంగాధర్ ,ఓంకార్, ఆవులబసప్ప ,రాజేష్ ,షేక్ సద్దం హుస్సేన్ ,రామకృష్ణ ,శ్రీకృష్ణ, నక్కిరిభాస్కర్, జానపద కళాకారులు మొలగవల్లి కొట్టాల కళాకారు లు తదితరులు పాల్గొన్నారు.

మద్దికేర సొసైటీ చైర్మన్‌గా ఆకుల ఆనందు

ప్రజాశక్తి-మద్దికేర




మద్దికేర సొసైటీ చైర్మన్‌గా ఆకుల ఆనందును, నెంబర్లుగా సుగులప్ప చిన్న పెద్దన్నను ఎంపిక చేసినట్లు కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆకుల ఆనందు విలేకరులతో మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి సొసైటీ చైర్మన్ గా ఎంపిక చేసిన ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబుకు, పెద్దాయన డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి కుటుంబానికి, మండలంలో తెలుగుదేశం పార్టీ నాయకులకు కార్యకర్తలకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. సహకార సొసైటీ తరపున రైతు లందరికీ న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈ అవకాశం కల్పించిన ఎమ్మెల్యే శ్యామ్ కుమార్‌కు, టిడిపి నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జీవాలకు నట్టల మందు పంపిణీ : సన్న జివాలైన గొర్రెలు మేకలకు నటల నివారణ మందులు పంపిణీ చేసినట్లు మండల పశు వైద్యాధికారి లక్ష్మన్న తెలిపారు. మద్దికేర మండలంలోని గొర్రెలు మేకలకు కడుపులోని నులిపురుగుల నిర్మూలనకు వాటి ఎదుగుదలకు దోహదం చేసే నట్టల మందు పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని పశు వైద్య కేంద్రాల్లో నట్టల నివారణ మందు అందుబాటులో ఉందని తెలిపారు. ప్రతి రైతు ఈ కార్యక్రమాన్ని ఆధార్ కార్డు జిరాక్స్ అందజేసి సన్న జీవాలకు ఉచితంగా నట్టల నివారణ మందును త్రాగించాలని తెలిపారు. రైతులు జీవాలు పశువులు రోగాలు బారిన పడకుండా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నివారణ మందు పంపిణీ ప్రాముఖ్యతను రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పశువైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

పూలచింత గ్రామ టిడిపి అధ్యక్షుడిగా షరీఫ్

ప్రజాశక్తి-నందవరం

పూలచింత గ్రామం టిడిపి అధ్యక్షుడిగా షరీఫ్ ఎంపికయ్యారు. శుక్రవారం ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో టిడిపి గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. అందులో భాగంగా పూలచింత టిడిపి సీనియర్ నాయకులు బండే గురుస్వామి ప్రతిపాదనతో ఎమ్మెల్యే బీవీ గ్రామ అధ్యక్షుడిగా షరీఫ్‌ను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే బివిని పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ నాపై నమ్మకంతో ఎమ్మెల్యే బివి, బండే గురుస్వామిలు అధ్యక్షులు ఎన్నుకున్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా గ్రామంలోని టిడిపి కార్యకర్తలందరిని కలుపుకుని, టిడిపి మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కందనాతి గ్రామానికి ఆశ వర్కర్ నియమించాలి

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు



మండల పరిధి లోని కందనాతి గ్రామానికి ఆశవర్కర్‌ను ఉంచాలని గ్రామ ప్రజలు కోరారు. ఈ సందర్భంగా కందనాతి గ్రామ ప్రజలు విజయవాడకు వెళ్లి ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ కమిషనర్ వీరపాండ్యను కలిసి గ్రామ ప్రజలు ఆశ వర్కర్ పోస్ట్ నియమించాలని కోరామని చంద్రశేఖర్, బిజీ కేసన్న, నరసన్న, సోమన్న, రాజు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కందనాతి గ్రామంలో 3000 పైచిలుకు జనాభా ఉందన్నారు. గతంలో ఆశ వర్కర్లు వర్క్ చేసేవారు అయితే ఒకరు అనారోగ్యంతో మరణించడంతో ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన ఎవరు లేరని చాలా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల ఆరోగ్యం రీత్యా వెంటనే ఆశ వర్కర్ ను నియమించాలని కోరారు.



నెరణికి గ్రామంలో కార్డెన్ సెర్చ్

-150 లీటర్ల నాటు సారాస్వాధీనం,ఒక్కరి పై కేసు నమోదు

ప్రజాశక్తి-హోళగుంద

మండల పరిధిలోని నెరణికి గ్రామంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించ్చినట్లు ఎస్ఐ దిలీప్ కుమార్ గురజాల ఆదివారం తెలిపారు. ఆలూరు సి ఐ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నేరణికి, కొత్తపేట గ్రామాల్లో ని ఇళ్ల లొ అక్రమంగా నిల్వ ఉంచిన 150 లీటర్ల నాటు సారా ను స్వాధీనం చేసుకొని, ఒక్కరి పై కేసునమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాలో నాటుసారా తయారుచేసినా అమ్మిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆలూరు ఎస్ఐ మహబూబ్‌బాషా, హెడ్ కానిస్టేబుల్ లక్ష్మి రామ్ నాయక్, కానిస్టేబుళు సుధాకర్, పెద్దన్న, గురు ప్రసాద్, రామాంజిని రెడ్డి, శేక్షావలి, జనార్ధన్, వెంకటేష్, రాజగోపాల్ పాల్గొన్నారు.

మళా మల్లేశ్వర స్వామి కి ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-హోళగుంద

దేవరగట్టు మాల మల్లేశ్వర స్వామి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు మనోహర్ స్వామి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లవారుజాము నుండి స్వామి అమ్మవారికి ప్రత్యేక పూజలు మహా మంగళహారతి, ఆకుపూజ, రుద్రాభిషేకం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి కాక ఆంధ్ర కర్ణాటక నుంచి భక్తులు పెద్ద సంఖ్యల తరలివచ్చి స్వామి అమ్మవాలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం నిర్వహించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.



మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండ మండలం కప్పట్రాళ్ల గ్రామంలో నీటి సమస్య పరిష్కారానికి ఆలూరు టిడిపి ఇంచార్జ్ వీరభద్ర గౌడ్ కృషి చేయడం పట్ల ఆ గ్రామ టిడిపి నాయకులు మల్లికార్జున ఆదివారం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి ఆయన దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన వీరభద్ర గౌడ్ వెంటనే బోరు బండి పంపించారని అన్నారు. బోరు వేయగా నీళ్లు పడినందున గ్రామస్తులు, కాలనీవాసులు కూటమి ప్రభుత్వానికి ఇన్చార్జి వీరభద్ర గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. గ్రామ టిడిపి పార్టీ నాయకులు గొర్ల సుంకన్న, నారాయణ, రవికుమార్, గౌడు, రంగన్న, రంగనాయకులు, తిమ్మప్ప, గోపాల్, దుబ్బన్న, చిన్న లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో కంపచెట్ల తొలగింపు

ప్రజాశక్తి-కోసిగి: స్థానిక హిందూ స్మశాన వాటికలో ఆదివారం గ్రామ పెద్దలు హొళగుంద కోసిగయ్య , వక్రాణి వెంకటేశ్వర్లు , రామప్పల ఆధ్వర్యంలో స్మశాన వాటికలో కంపచెట్లను తొలగించారు. చివరి మజిలీ అయిన స్మశాన వాటికలో కంప చెట్లు పెరిగి గ్రామంలోని చెత్త చెదారంతో నిండి ఉన్న స్మశాన వాటికలో గ్రామస్తుల ఆర్థిక సహాయంతో జెసిబి తో కంపచెట్లు తొలగించి , చెత్త చెదరాన్ని కాల్చివేశారు. దహన సంస్కారాలు చేసేటప్పుడు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని తెలుసుకొని కంప చెట్లు తొలగించారు. .కూటమి ప్రభుత్వంలో స్మశాన వాటికకు చుట్టూ కాంపౌండ్ ఏర్పాటు చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో స్మశాన వాటికను శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు. కాంపౌండ్ తో పాటు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసే విధంగా గ్రామ పెద్దలతో మాట్లాడి చందా రూపంలో డబ్బులు పోగుచేసుకుని ఏరాటు చేస్తామన్నారు. గ్రామస్తులు గాణిగి వీరస్వామి, తిమ్మప్ప, జక్కనగేని గోవిందు, బసవరాజు పాల్గొన్నారు.

పౌరాణికాలకు పల్లెటూళ్లలో నేటికీ ఆదరణ

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

ఇప్పటికీ పల్లెటూళ్లలో పౌరాణిక నాటకాలకు ఆదరణ ఉందని పారిశ్రామికవేత్త సినీ నటులు బ్రహ్మ రిషి బీవీ రెడ్డి తెలిపారు. ఆదివారం టీజీవి కళాక్షేత్రంలో స్వేచ్ఛ నాటక ప్రదర్శన శ్రీకృష్ణ రాయబారం లోని ఒక సన్నివేశం ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి పుల్లయ్య, పారిశ్రామికవేత్త బీవీ రెడ్డి హాజరయ్యారు. సభకు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య స్వాగతం పలుకుతూ వారం వారం సాంస్కృతిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని కుటుంబ సమేతంగా హాజరై వినోదం పొందాలని కోరారు. స్వేచ్ఛ నాటిక రాష్ట్రవ్యాప్తంగా ప్రదర్శన చేస్తూ అనేక బహుమతులను పొందినన్నారు. అనంతరం బీవీ రెడ్డి మాట్లాడుతూ తన చిన్నతనంలో రాత్రి 10 గంటలకు ప్రారంభమైతే ఉదయం 6 గంటల వరకు పౌరాణిక నాటకాలు ఉండేవన్నారు. ఎన్‌టిరామారావు తో పాటు ఎందరో సినీ నటులతో పరిచయం ఉందని సినిమాలకు ఆదరణ క్రమేపి తగ్గటం విచారకరమన్నారు. రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య మాట్లాడుతూ కొత్తతరం నటులను తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సభ ప్రారంభంలో శ్రీకష్ణరాయబారంలోని పడక శీను సన్నివేశాన్ని శ్రీకృష్ణునిగా జి భాస్కర్ యాదవ్, అర్జునుడిగా కేవీ రమణ, దుర్యోధనునిగా చల్ల నవీన్ కుమార్ పాల్గొన్నారు. తర్వాత స్వేచ్ఛ సాంఘిక నాటికను ప్రదర్శించారు. ఇందులో బలగం సినిమా ఫేమ్ సురభి లలిత, మంజు, గోవర్ధన్ రెడ్డి తదితరులు సీనియర్ దర్శకులు బిఎం రెడ్డి పర్యవేక్షణలో ప్రదర్శించారు. శ్రీకృష్ణ రాయబారం కళాకారులను స్వేచ్ఛ నాటిక కళాకారులను బీవీ రెడ్డి, జి.పుల్లయ్య, బీసీ సంఘం నాయకులు నక్కల మిట్ట శ్రీనివాసులు, దస్తగిరి కన్వీనర్ పి రాజారత్నం కార్యదర్శి మహమ్మద్ మియా తదితరులు సన్మానించారు. వర్షం వచ్చినా ప్రేక్షకులు హాజరై ఆద్యంతం ప్రదర్శనలు తిలకించారు.



శ్రీకృష్ణ రాయభారం లోని పాత్రదారులను సన్మానిస్తున్న జి.పుల్లయ్య , తదితరులు

ఎంఆర్‌పిఎస్ నాయకుడి మృతికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-ఆదోని

ఎమ్మార్పీఎస్ నాయకుడు మాజీ కౌన్సిలర్ గోవిందరాజులు మృతి తీరని లోటని ఎమ్మెల్యే పార్థసారథి విచారం వ్యక్తం చేశారు. ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర నాయకుడు సుభాష్ చంద్ర మాదిగ తో కలిసి ఆదివారం ఆదోనిలోనే ఇందిరానగర్‌లో గోవిందురాలు భౌతికయానికి పూలమాలతో నివాళులర్పించారు. ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ మాదిగల ఆత్మగౌరవ పోరాటం అయినా వర్గీకరణ ఉద్యమంలో గోవిందరాజులు చూపిన పోరాట పటిమ ఆదర్శనీయమన్నారు. కౌన్సిలర్ గా వార్డులో ప్రజా సమస్యలు పరిష్కరించి తలలో నాలుకల జనంలో నిలిచారన్నారు. ఆయన శనివారం ఉదయం అనారోగ్యంతో మతి చెందారని బంధువులు తెలిపారు. హిందు స్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి. ఎంఆర్‌పిఎస్ నాయకులు బండారి హనుమంతు, గిడ్డయ్య, నాగప్ప, మనోజ్, మణి, జనసేన నాయకుడు పులి రాజు ఉన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి-హాలహర్వి

మండల కేంద్రమైన హాలహర్వి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 2006-07 లో చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు కలుసుకుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో ఒక్కరోజు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొంటే ఆనందంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పలు సాంస్కతిక, సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ప్రధానోపాధ్యాయులు జయమ్మ, పూర్వ అధ్యాపకులు ఎన్ఎస్ రియాజ్ , మాథ్స్ వీరేష్ అటెండర్ శేఖర్ తదితరులు మాట్లాడుతూ, అంతంత మాత్రమే సదుపాయాలు ఉన్న ఆనాటి రోజుల్లో చదువుకున్న విద్యార్థులు నేడు ఉన్నత స్థాయిలో ఉండడం తమకు గర్వకారణంగా ఉందన్నారు. 18 ఏళ్ళ తరువాత కూడా తమను గుర్తుంచుకుని సత్కరించడం ఎంతో సంతోషం కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మల్లికార్జున, జనార్ధన్, లోకేష్, యోగానంద రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

స్పష్టమైన హామీ ఇవ్వని ప్రభుత్వం

- ఆందోళన కొనసాగిస్తాం - ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికులు

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్ ఇంజనీరింగ్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూల స్పందన వచ్చేంత వరకు ఆందోళన కొనసాగిస్తామని యూనియన్ నాయకులు పిరా సాహెబ్, సోమన్న, హమ్మద్ తెలిపారు. ఆదోని మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు కొనసాగిస్తున్న సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు మున్సిపల్ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి వివిధ రూపాలలో నిరసన తెలిపామన్నారు. స్పందించిన మంత్రి నారాయణ ప్రభుత్వం కొద్దిగా సానుకూలంగా ఉంది అని ప్రకటించారన్నారు. సీఎం కూడా మూడు నాలుగు రోజుల్లో మీ జీతాలు పెంచే విషయమై ఒక నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. అందుకు కార్మికులు ఎంతో ఆశగా సీఎం ప్రకటన కోసం ఎదురు చూస్తున్నామన్నారు. త్వరగా మా సమస్యకు పరిష్కారం దొరుకుతుందని కార్మికులందరూ వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు త్వరగా పరిష్కరిస్తారని ఆశిస్తున్నామన్నారు. ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు కార్మిక సంఘం నాయకులు కార్మికులు శరత్, కర్రెప్ప, కుమార్, శివశంకర్, భూకన్న, బషీర్, అల్తాఫ్, జెసిబి సురేష్, రియాజ్ ఉన్నారు.



యువ క్రీడాకారులకు చేయూత

ప్రజాశక్తి-ఎమ్మిగనూరు

యువ క్రీడాకారులకు బుట్ట ఫౌండేషన్ ద్వారా చేయూతని ఇద్దామని బుట్ట ఫౌండేషన్ అధినేత బుట్ట శివనీలకంఠ పేర్కొన్నారు. ఆదివారం ఎమ్మిగనూరు జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో ఫుట్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మహబూబ్ సెక్రెటరీ పాల్ శ్రీనివాస్ రెడ్డి , ఫుట్‌బాల్ కోచ్ మాబు, ఫుట్ బాల్ టీం బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివ నీలకంఠను ఘనంగా సన్మానించారు.వైసిపి ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇంచార్జ్ బుట్టా రేణుక భర్త అయిన బుట్టా ఫౌండేషన్ అధినేత బుట్టా శివనీలకంఠ మాట్లాడుతూ బుట్టా ఫౌండేషన్ ద్వారా యువ క్రీడాకారులను అన్ని విధాలా ప్రోత్సహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఫుట్ బాల్ అసోసియేషన్ పాల శ్రీనివాస రెడ్డి, అధికార ప్రతినిధి సునీల్ కుమార్, పట్టణ నాయకులు , పట్టణ ఉపాధ్యక్షులు, కోటకొండ నరసింహులు, నియోజవర్గం గ్రీవెన్స్ అధ్యక్షుడు విశ్వనాథ రమేష్ ప్రభాకర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

